# సమిధ

కొశ్చన్ పేపర్లు అందరికీ పంచేసి కుర్చీలో కూర్చోబోతూ వోమారు హాలంతా కలయచూచాడు వెంకటరత్నం.

హాలంతా నిశ్శబ్దంగా వుంది. చాలా మంది విద్యార్థులు యింకా కొశ్చన్లు చదవటంలోనే ఉన్నారు. ఎవరో నలుగురైదుగురు విద్యార్థులు మాత్రం తలలు వంచుకొని బర బరా వ్రాసేస్తున్నారు.

సూర్యారావు సీటింగు ఏరేంజ్‌మెంటు షీటు, ఏబ్సెంటీ స్టేట్‌మెంటు పట్టుకొని వొక్కొక్క సీటు వద్దకెళ్లి హాల్‌టిక్కెట్లు చూచి, నెంబర్లు వెరిఫై చేస్తున్నాడు.

ఆ మూల - వెనుకనుంచి నాలుగో బెంచి చివరనున్న కుర్రాడు - బిత్తర చూపులు చూస్తూ జేబులు తడుముకొంటున్నాడు. వెంకటరత్నం తనవైపు చూడగానే అదోవిధంగా నవ్వి సూర్యారావు వైపు దృష్టి మరల్చాడు. అతని పేరు ప్రసాద్. ఆ కాలేజీకి, బి.ఎ. పరీక్షకీ కూడా పాతకాపే. తెలియనివారు లేరు.

సూర్యారావు కుడివైపు బెంచీలు పూర్తిచేసి ప్రసాద్ కూర్చున్న వైపువస్తూ అతని ముఖకవళికలను కనిపెట్టేడు. అయినా మామూలుగా వెరిఫైచేసి ముందుకుసాగేడు.

ఇటువైపు కుడి వరుసలో ముందు నుంచి మూడో వరుసలో మధ్యన కూర్చున్న మాధవరావు చకచకా రాసేస్తున్నాడు - మధ్య మధ్య ఆన్సర్ స్క్రిప్టు ఎత్తి పట్టి చూస్తూ.

ఆ దృశ్యం చూచిన వెంకటరత్నం అప్రతిభుడయ్యాడు. మాధవ్‌కు సరిగ్గా ఎదురుగ్గా కూర్చున్నాడతను. అయినా తన వునికినే గమనిస్తున్నట్లు లేదు అతను. ''అండర్ మై వెరీనోస్ - కాపీయింగ్, హౌ డేరింగ్'' అనుకున్నాడు వెంకటరత్నం. అనుకొని ఆశ్చర్యయిస్తూనే లేచి నిల్చున్నాడు. మాధవ్ వైపు పరికించిచూచాడు. ఊహూ.. అతనివేమి గమనిస్తున్నట్లే లేదు. చకచకా రాసుకుపోతున్నాడు.

వెంకటరత్నానికి తల కొట్టేసినట్లయింది. లేచి అతని బెంచీవైపు నడిచి, బల్లమీద చిన్నగా శబ్దం చేశాడు. మాధవ్ వెంకటరత్నంవైపు వోచూపు చూచాడు. ఆ వెంటనే వోనవ్వు నవ్వేడు.

ఆ చూపులో దైన్యం వుంది. వేడికోలు వుంది. నిర్భయత్వం, తెగింపు, బెదిరింపుకూడా వున్నాయి.

వెంకటరత్నం అతని కళ్ళల్లోకి చూచి ''తప్పు'' అన్నట్లు తల వూపేడు. ప్రతిగా ''క్షమించండి'' అన్నట్లు చూచాడు మాధవ్.

''ముందుగానే చెప్తున్నాను. మీ దగ్గర కాగితాలు కాని, పుస్తకాలు కాని, స్లిప్పులు కాని వుంటే యిప్పుడే బయట పెట్టేయండి. ఇదే చివరి ఛాన్సు. నేను 'మాల్‌ప్రేక్టీసు' సహించను—''

సూర్యారావు గొంతు గంభీరంగా విన్పించింది.

అంతా సూర్యారావు వైపు చూశారు. కొందరు మామూలుగా చూస్తే, చాలామంది మింగేసేలా చూశారు.

అయితే సూర్యారావు ఆ కాలేజీ లెక్చరర్‌గావచ్చి యింకా నెలన్నా నిండలేదు. అతను వచ్చేసరికే "ప్రిపరేషన్ హాలీడేస్" యివ్వటంవల్ల అతన్ని విద్యార్థులకు తెలియదు. అతనికెవరూ విద్యార్థులు తెలియరు.

అయితే యూనివర్సిటీ పరీక్ష మొదలైన రోజే అతనిపేరు ఆ వూరిసెంటర్లో మారుమోగిపోయింది. కారణం— అతను ఆ వొక్కరోజునే ఆరుగుర్ని కాపీ చేస్తుండగా పట్టుకొన్నాడు.

అలాంటి సంఘటన ఆ కాలేజీలో జరగడం చాలా అరుదు.

అల్లరికి ఆ కాలేజీ ఎంత పేరుమోసినదో, కాపీలు కొట్టటంలోనూ అంతే. అది తప్పుకాదు - గొప్ప. హీరోయిక్ ఏక్షన్. కాపీలుకొట్టూ, మేస్టర్ల కంటపడకుండా వారిని ఎలా ఏడ్పించిందీ సెంటర్లో వొపక్కచేరి గొప్పగా చెప్పుకొంటారు విద్యార్థులు. ఆ సెంటర్లోనే మరోవైపు చేరి, కొందరు లెక్చరర్లు తమ అనుభవాలను చిలవలుపలవలుచేసి చెప్పుకొంటారు.

కాలేజీ కారిడార్‌లోవిద్యార్థి సిగరెట్టుతాగి ఆ పొగను తమ మొహంమీదనే వొదిలినా తలవంచుకొని నవ్వుతూ వెళ్ళిపోవటం అలవాటు చేసుకున్నారు లెక్చరర్లలో చాలామంది. అడపాదడపా యింకు చల్లినా, పకోడి, పాన్ అంటూ ముద్దుపేర్లు పెట్టినా చిన్మయానందముద్రే లెక్చరర్లకు శరణ్యం.

క్రమశిక్షణ అన్నపదం ఆ కాలేజీ కాంపౌండ్ దాటి లోపలికిరావటానికి వీల్లేకుండా కట్టుదిట్టం చేశారు విద్యార్థులు. వారు కట్టుకొన్న ఆ కోటను పగులగొట్టి, డిసిప్లిన్ అన్నపదాన్ని రాజఠీవితో లోపలికి తీసికెళ్ళి కాలేజీ ఆవరణలో చెట్టుచెట్టుకీ గోడగోడకీ, ప్రతి అంగుళం ప్రతిష్ఠింపచేసిన ఖ్యాతి కొత్తగావచ్చిన ప్రిన్సిపాల్ గారికే దక్కింది.

సూర్యారావు ఆ కాలేజీలో చేరటానికి కొద్ది వారాలముందే ఆయనా ఆ కాలేజీకి వచ్చాడు. రాగానే ఆయన చేసిన మొదటిపని - ఇన్‌డిసిప్లిన్ అన్నపదానికే ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు కారిడార్‌లో కేకలేస్తూ, ఆడపిల్లల్ని ఏడిపిస్తున్న యిద్దరువిద్యార్థులను సస్పెండ్ చేయటం.

మరోగంటలో కాలేజీ వాతావరణమే మారిపోయింది. అలా ప్రారంభమయిన మార్పు — ప్రతిక్షణం మారుతోవచ్చి ఇన్‌డిసిప్లిన్ అన్న పదాన్ని ఆ ఆవరణంనుంచి తరిమేసింది.

అయితే ఈ మార్పును అంగీకరించేస్థితిలో లేరు విద్యార్థులు.

అల్లరి తమ జన్మహక్కు. ఎన్నోఏళ్లుగా అలవాటుపడ్డారందుకు. కాగా దేశంలోని తమ సోదరులంతా పుష్కలంగా అల్లరి చేస్తున్నారు. ఏ పేపరు చూచినా విద్యార్థుల అల్లరిని గురించిన వార్తలే. మరి అందరికీ అందుబాటైన ఆ హక్కును తమకుకాదనే అధికారం ఎవరిచ్చారీ ప్రిన్సిపాలుకు? కాగా తమ అల్లరివల్ల నష్టపోయేదెవ్వరు? తాము - తమ తలిదండ్రులు - తమనందర్నీ పాలిస్తున్న

ప్రభుత్వం - ఈ ప్రభుత్వం పాలబడ్డ యీ దేశం. వీరందరికి అక్కర్లేని డిసిప్లిన్ యీ ప్రిన్స్‌పాల్‌కే కావాలేం?

ప్రిపరేషన్ హాలిడేస్ రావటంతో విద్యార్థుల ఆలోచనలు, ఆవేశాలూ వాళ్ళల్లోనేవుండి పోయాయి.

రేపు పరీక్షలురావూ? అప్పుడు తమ తడాఖా చూపమా — అనుకొన్నారు.

అనుకొన్న పరీక్షలు రానేవచ్చాయి.

కానీ ఈ పరీక్షలు మునిపటిలాలేవు. తమను కనిపెట్టటానికివచ్చిన మేష్టర్లు మునపటిలా లేరు. అంతటా ఏదోమార్పు -

కొశ్చన్ పేపర్లిచ్చి కబుర్లుచెప్పుకోవటం లేదు. పేపర్లు, నవలలు చదువుకోటం లేదు. కాళ్ళు నొప్పిపుట్టేలా తిరుగుతూనేవున్నారు.

యీ మార్పు తెచ్చిన ఆశ్చర్యంనుండి తేరుకోకముందే పిడుగులాంటి వార్త- ఆ రోజు అరడజను విద్యార్థులను సూర్యారావు అనే కొత్త మేష్టరు పట్టుకొన్నాడు.

సూర్యారావు రెండుకళ్ళను వేయికళ్ళు చేసి కనిపెట్టి తిరుగుతున్నాడు హాలంతా.

మాధవ్ వెంకటరత్నంవైపు చూచాడు నిస్సహాయంగా. వెంకటరత్నం తన అసహాయతను వ్యక్తం చేస్తున్నట్లు చూచాడు మాధవ్‌వైపు.

మాధవ్ తలవంచుకుని, పేపర్ ఎత్తకుండా ఏదో గిలుకుతున్నాడు.

వెంకటరత్నం వెనక్కి వెళ్ళి కుర్చీలో కూర్చుంటూ గోపాల్‌ను చూచాడు.

అరగంట అయినట్లు బెల్లు మోగింది.

★——★——★

గోపాల్‌ను వెంకటరత్నం చూచిన క్షణంలోనే సూర్యారావు చూచాడు. వెంకటరత్నం కుర్చీలో కూర్చునేలోగానే గోపాల్ దగ్గరికెళ్ళేడు. చెమటలు పోస్తున్న గోపాల్ హడావుడిగా గైడ్‌ను మోకాలుతో బల్లకెత్తిపట్టి మరో మోకాల్ను మడతవేసి కూర్చున్నాడు.

"కమాన్ గివ్ యిట్ -"

అందరి దృష్టులు అటువైపే మళ్ళాయి. గోపాల్ పలక లేదు.

"ఐసే - గివ్ ఇట్ -"

గోపాల్ కాస్త సర్దుకున్నాడు. ధైర్యంతెచ్చుకున్నాడు.

"ఏంలేదు మాస్టారూ..."

"లేదూ?"

"కావాలంటే యివిగో జేబులు... ఆన్సర్ కాగితం... చూచుకోండి."

"వెరీ గుడ్. స్టేండ్ అప్ —"

నిల్చుంటే మోకాలు పొజిషన్ తప్పుతుంది. గైడ్ బయటపడుతుంది.

''ఎందుకు మాష్టారూ. చూచుకోండి-'' అంటూ జేబు దులిపాడు. ఆన్సర్ కాగితాలు బోర్లించాడు.

గోపాల్ యివిచేస్తున్నప్పుడు, సమయం గమనించి, మోకాళ్ళ మధ్యనున్న గైడ్ లాగేశాడు సూర్యారావు

''మేష్టారూ...''

గోపాల్ ధైర్యం చెదిరిపోయింది. చెమటలు కారుతున్నాయి - మొహంలో భయం - దైన్యం. నలభై రెండ్లు ఎనభై కండ్లు అతన్నే చూస్తున్నాయి.

కాలేజీలో ఆడపిల్లల జడలు లాగటానికి జంకని గోపాలుడు, పొరపాటున వో ముద్దరాలు అల్లరి సహించలేక ''బ్రూట్'' అంటే, ఆ అతివ రెండుజడలనూ నిర్దాక్షిణ్యంగా కత్తిరించేసిన గోపాలుడు - కొందరు ఆడపిల్లలపాలిటి హీరో గోపాల్, మరికొందరిపాలిటి విలన్ గోపాల్ - ఆ క్షణంలో సూర్యారావు ముందు తల వంచుకుని ముద్దాయివలె నిలబడ్డాడు.

''పొరపాటయింది మాష్టారూ... యింకెప్పుడూ చేయను—''

సూర్యారావు తను చెయ్యాల్సిన ఫార్మాలిటీస్‌ను ప్రారంభించాడు.

''మాష్టారూ...''

ఇంట్లో తనపైన ఆశలునింపుకొని చూస్తున్న తలిదండ్రులు కళ్ళల్లో మెదలగా, వెంకటరత్నంవైపు చూస్తూదీనంగా అన్నాడు గోపాల్. వెంకటరత్నానికి గోపాల్ కుటుంబ స్థితి తెల్సు. పైకి హీరోలా, దర్జాగా, ధైర్యంగా విచ్చలవిడిగా తిరిగే గోపాల్ కుటుంబంలో ఎన్నో కష్టాలు. తండ్రి గుమస్తా- తల్లి రోగిష్టి. యిద్దరు అక్కలు పెళ్లికి ఎదిగి వున్నారు. మరో యిద్దరు పిల్లలు లోకం తెలియనివారు. అంతా వీడేదో చదివి వుద్ధరిస్తాడని ఆశలు పెట్టుకొన్నవారే.

వెంకటరత్నం సూర్యారావు దగ్గరి కెళ్ళాడు. సూర్యారావు అన్సర్ స్క్రిప్టు, గైడు తీసుకొన్నాడు. గోపాల్‌తో 'కమ్ విత్ మి-' అన్నాడు

''మాష్టారూ...''

సూర్యారావు వెంకటరత్నంవైపు తిరిగేడు.

''మరోమారు ఆలోచించండి. బీద ముండాకొడుకు పాపం. అతనిమీద ఆశలు పెట్టుకొని వున్నారు. ఏదోకాస్త తక్కువ పనిష్మెంటు.''

''సారీ మాష్టారూ, ఐవిల్ డు మై డ్యూటీ.''

సూర్యారావు ప్రిన్సిపాల్ రూమ్‌వైపు నడిచాడు.

అతన్ని దీనమైన చూపులతో అనుసరించాడు గోపాల్.

రెండోఅరగంట అయినట్లు బెల్లుమోగింది.

★——★——★

ఉన్నట్లుండి వొక్కసారిగా పరీక్షహాలు చేపల మార్కెట్టులా మారింది.

అంతా గుసగుసలు. కొందరు జరిగిన సంఘటనను గూర్చి మాట్లాడుతుంటే, మరికొందరు అనుమానాలు నివృత్తి చేసుకొంటున్నారు - పక్కవారినడిగి. చాలామంది జేబుల్లో ''బుల్లెట్స్'' పైకి లేచాయి. మాధవ్ చకచకా రాసేస్తున్నాడు. ఏ కొశ్చన్‌కి ఏ ఆన్సర్ రాయాలో కూడా తెలీని ప్రసాద్, అడిగిన కొశ్చన్లకు సరైన ఆన్సర్లున్న స్క్రిప్టులను బయటికితీసి పెట్టుకొని, తన మిత్రుడిపట్ల సూర్యారావు ప్రవర్తనని గురించి ఆలోచిస్తున్నాడు.

''సైలెన్స్ ప్లీజ్''

వెంకటరత్నం హెచ్చరిక హెచ్చుతున్న శబ్దంలో కలిసిపోయింది.

''నో కన్సల్‌టేషన్స్ ప్లీజ్ -''

అయినా కన్సల్‌టేషన్స్ కంటిన్యూ అవుతూనే వున్నాయి.

వెంకటరత్నానికి కోపమొచ్చింది. భయమేసింది. యింతవరకు ప్రశాంతంగా వుండి సూర్యారావు అలా పోగానే గాలిదుమారంలా గుసగుసలు ప్రారంభమయ్యాయంటే అర్థమేమిటి?

తన చాతకాని తనానికి, తన అసమర్థతకు అంతకన్నా మించిన తార్కాణం ఏంకావాలి? తన మంచి తనానికి విద్యార్థులిస్తున్న బహుమతి యిదన్నమాట! యిప్పుడు ప్రిన్సిపాలుగారు యిటువస్తే తనగతేమిటి?

వెంకటరత్నం శరీరం కోపంతో వుడికి పోయింది. చకచకా వెళ్లి మాట్లాడు కొంటున్న యిద్దర్ని పట్టుకొని లేపాడు.

''గెటవుట్ ఫ్రం దిరూమ్.''

ఆ యిద్దరు పిల్లలు అల్లరికి అలవాటుపడ్డ వాళ్ళుకాదు. పుస్తకాల పురుగులు. అంతా పుస్తకాలుచూచి కాపీకొట్టున్నారుకదా, తమకొచ్చిన అనుమానాలు తీర్చుకొంటే తప్పేమిటన్నట్లు వాళ్ళలో వొకడేదో మరొకడి నడిగాడు. మరొకడు ఏదో మాట్లాడేలోగానే ఈ వుపద్రవం వచ్చింది. నిజానికి వాళ్ళిద్దరూ ఫస్టుక్లాసు విద్యార్థులు.

''క్షమించండి మాస్టారూ. మేమేం చేయడం లేదు.''

''ఏం చెయ్యటంలేదూ? స్టేండ్ అప్ ఫస్ట్. గివ్ దోజ్ ఆన్సర్ స్క్రిప్ట్స్''

ఆ పిల్లలిద్దరూ ఆన్సర్ పేపర్లను తమ ప్రాణంకన్న మిన్న అన్నట్లు హృదయానికి కరుచుకొన్నారు. అందులో సంవత్సరం కృషి వుందిమరి!

''యిస్తారా యివ్వరా?''

''పోనీలెండి మాస్టారూ, యీ సారికి వదిలెయ్యండి పాపం——''

అయాచితమైన ఈ సానుభూతి ఆ యిద్దరు కుర్రాళ్ళకు మేలు చేయలేదు. వెంకటరత్నం కోపం మరింత పెరిగింది.

''మాస్టారు మంచివారు కదా అని మాట్లాడితే తప్పు కాదూ? ఆయనకు మాట రాదూ? మాట్లాడకుండా రాసుకోండి-'' ఎవరో పెద్ద మనిషిలా మందలించాడు తోటివారిని

''అలాగే మాట్లాడం మాస్టారూ, పాపం వాళ్ళిద్దర్నీ వదిలేయండి-'' మరొకడెవరో అభయమిస్తున్నట్లు అన్నాడు.

కాని పదిహేను నిముషాలక్రితం వెంకటరత్నం కాదు యిప్పటి వెంకటరత్నం. కాగా ఈ మాటల ముద్రలు అతనిలోని కరుకుతనాన్ని మరింత పెంచాయి.

''షటప్ ఐసే. గివ్ దోస్ పేపర్స్-'' తల్లి వొడిలోని పసిపాపను నిర్దాక్షిణ్యంగా లాక్కొనే సినిమాలో విలన్‌లా ఆ యిద్దరు కుర్రాళ్ళ హృదయాలనంటి పెట్టుకొని వున్న ఆన్సర్ పేపర్లను లాగేసుకొన్నాడు వెంకటరత్నం.

ఆయన లాగేసేననుకొంది, ఆన్సర్ పేపర్లే. కాని వాళ్లు హృదయాలనే కోల్పోయారు.

కళ్ళల్లో నీళ్ళు చిమ్మేయి. ఎదుటివాడి హృదయం పగిలిపోయేలా దీనంగా అన్నారిద్దరూ ఒకేసారి- ''మమ్మల్ని అన్యాయం చేయకండి మాస్టారూ. ఈ పరీక్షకోసం ఎంతో చదివేం. ఆశలు పెట్టుకొన్నాం. చిన్న తప్పుకు పెద్ద దండన విధించి మా జీవితాల్ని నాశనం చేయకండి -''

వెళ్తున్న వెంకటరత్నం కొట్టినట్లయి వెనక్కి తిరిగి వాళ్ళవైపు చూచాడు. సరిగ్గా యివే మాటలు.... యివే మాటలు.... పదేళ్ళక్రితం...

వెంకటరత్నానికి రాజారావు గుర్తుకొచ్చాడు..

రాజాలాగ బ్రతుకుతాడనుకొన్న రాజారావు మాసిన బట్టలతో, చెదిరిన మనసుతో, ఆ రోజు..రోడ్డుమీద అకస్మాత్తుగా తారసిల్లిననాడు తాను భయపడ్డాడు.

స్వతహాగా రాజారావు భయపడతగ్గ మనిషేం కాదు. కాని ప్రాణాపాయంవస్తే పిల్లి కూడా పైనపడి రక్కుతుంది.

అటువంటిది- రాజారావు మనిషి. జీవితం మీద ఎన్నో ఆశలు పెట్టుకొన్న విద్యార్థి. పరీక్షహాల్లో పక్కవాడితో మాట్లాడేడని తను డీబార్ చేయిస్తే వూరుకుంటాడా?

కాని రాజారావు తననిచూచి వుద్రేకపడలేదు. ''చిన్న తప్పుకు పెద్దదండన విధించారు మాస్టారూ. పుస్తకాలు చూచి రాసినవాళ్ళు బాగానే వున్నారు. దురదృష్టం నన్ను వరించింది. ఇంక నేనెవరికోసం బతకాలి మాస్టారూ. ఈ మచ్చను వెంటపెట్టుకొని ఆజన్మాంతం ఈ పాడుబతుకు బతక్కపోతేనేం?''

అదే చివరిసారి. పరీక్షహాల్లో చండప్రచండుడని పేరుపొందిన వెంకటరత్నం ''మంచి మాస్టరు''గా మారిపోయాడు పిల్లలకి.

మళ్ళీ పదేళ్ళ తర్వాత - అవేమాటలు.. ఆగి ఆలోచించాడు వెంకటరత్నం.

ఊహూ... తాను మరో యిద్దర్ని బలి చేయలేడు. అందులోను రిటైరు కాబోయే ముందు ఈ వేదనను జీవితాంతం మనసులో మూటగట్టుకుని...

చేతులో వున్న రెండు పేపర్లనూ ఎవరివి వారికిచ్చేస్తూ అన్నాడు - ''ఈసారికి వదిలేస్తున్నాను. బుద్ధిగా వ్రాసుకోండి -''

సూర్యారావు ప్లేసులో రిలీఫ్‌గా వచ్చిన సుందర్రావు, వెంకటరత్నం కోపగించుకొనేటప్పుడే ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు మరింత ఆశ్చర్యపోయాడు.

''వెంకటరత్నం మాస్టారుకీ...''

''జై' అన్న పదంతో ఆ హాలు మారుమోగిపోయేదే. కాని సరిగ్గా ఆ క్షణంలో సూర్యారావు లోపలికి అడుగు పెట్టేడు.

వెనక్కి తిరిగి వెంకటరత్నంతో, ''ప్రిన్సిపాలు గారు మిమ్మల్నోమారు రమ్మన్నారు!'' అన్నాడు.

మూడో అరగంట అయినట్టు బెల్లు మోగింది.

వెంకటరత్నం కండువా సరిచేసుకొంటూ బయటికి నడిచాడు.

★——★——★

విధి నిర్వహణలో ఎంత నిర్భయంగా వుండాల్సిందీ, ఉపాధ్యాయుడి నిజాయితీమీద పిల్లల భవిష్యత్తు, దేశ భవిష్యత్తు ఎలా ఆధారపడి వుంది, పరీక్ష హాల్లో ''ఇన్ విజి లేటర్'' బాధ్యతల గురించి ప్రిన్సిపాలుగారు చెప్పిందంతా విని బయటకొచ్చేసరికి వో అరగంట అయింది. ఆ పూటకి పరీక్ష చివరి ఘట్టంలో పడింది.

బయటికి రాగానే కన్పించాడు మాధవ్. అతని వెంటమరో పది మంది వున్నారు.

''మాస్టారూ.. యివాళ వాడో మేమో తేలిపోవాలి. రమ్మనండి ఆ సూర్యారావు గాడిని-'' అంటూనే వెళ్ళిపోయారు వాళ్ళు.

తాను లేని అరగంటలో ప్రళయాలు వచ్చాయని అర్థమయింది.

''రిలీఫ్'' సుందర్రావు ఆయన్ని అల్లంత దూరంలోనే చూచి ఎదురుగా వచ్చి నెమ్మదిగా అన్నాడు, ''యివాళ ఆయనగారు మంచి జోరులో వున్నారు. ఇప్పటికి ఆయనగారి ఆగ్రహానికి నలుగురు సమిధలయ్యారు. మరో యిద్దరో ముగ్గురో తప్పేట్టు లేదు. జాగ్రత్తగా గడిపేయండి ఈ అరగంట'' - అంటూ రహస్యంగా సలహా యిచ్చి వెళ్ళేడు.

వెంకటరత్నం నిట్టూర్చి లోపలికెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

అప్పటికే చాలామంది పేపర్లిచ్చి వెళ్ళిపోయారు. మరి కొందరు పేపర్లిచ్చే సన్నాహంలో వున్నారు. ఆ యిద్దరు కుర్రాళ్ళు తలలు వంచుకొని రాసేస్తున్నారు.

ఏమి రాయకుండా, ఏమి చేయకుండా సూర్యారావు ఎటు తిరిగితే అటు చూస్తూ కూర్చుని వున్నది వొక్క ప్రసాద్ మాత్రమే. పోయిన వాళ్ళలో ప్రసాద్ లేకపోవటం చిత్రమేననిపించింది వెంకటరత్నానికి.

ప్రసాద్ పేరుమోసిన కాలేజి పర్మినెంట్ విద్యార్థి. కాలేజి యూనియన్ ఎలక్షన్ల కోసం ప్రతిసారి ఫెయిలయి మళ్ళీ కాలేజీలో చేరుతుంటాడు. ఇలా బి.ఎ.కి, అతనికి వో విడరాని సంబంధం ఏర్పడింది.

అయితే నాలుగైదేళ్ళు వరుసగా యూనియన్ ప్రెసిడెంట్ అయి వరుసగా ఆ నాలుగేళ్ళూ ఆ బి.ఎ. పరీక్షకే కూర్చున్నాడు. రెంటి మీదా అతనికి విరక్తి కలిగింది. బి.ఎ. పాసయి యూనివర్సిటీకి పోయి, అక్కడి రాజకీయాల్లో పాల్గొనాలన్న ఆశ, కోరిక కలిగింది. అప్పటినుంచి బి.ఎ. పాసుకావాలని ప్రయత్నం.

కాపీకొడ్తే పట్టుకొంటాడన్న భయం అతనికి వెనుకవుండేది కాదు. అతని బాధల్లా ఒకటే - ఏ ప్రశ్నకు ఏ సమాధానంరాయాలో తెలియక వొకదానికొకటి, తీసుకుపోయిన కట్టలోనుంచి తీసి వ్రాసేవాడు.

ప్రతిసారి బాగా రాసేననుకోవటం - ఫెయిలు కావటం

యీసారి ఏ ప్రశ్నకు ఏ సమాధానం రాయాలో క్షుణ్ణంగా తెలుసుకునివచ్చాడు. ఇంత వరకు అయిన పరీక్షల్లో సరైన ఆన్సరేఏరుకుని చూచి వ్రాయగలిగేడు.

నిజానికివాళ సరైనకాగితాలే బొత్తిలోనుంచి తీసి పెట్టుకొన్నాడు.

కాని కాపీకొట్టే అవకాశం ఏదీ? తనఎదుటే తనతోటి "హీరో"లనందర్నీ పట్టుకొని బయటికి పంపించాడు. తన పైననిఘావేసి వుంచాడు. కొంపతీసి తననీ పట్టుకొంటే? పరీక్షపోయినందుకు బాధలేదు. కానీ ఎంత అపకీర్తి? తనను - వూరంతా గడగడలాడే తనను - వో కుర్ర లెక్చరరు వెధవ పట్టుకోవటమా?

అప్పటికీ సూర్యారావు లేని అరగంటలో వొక ప్రశ్నకు పూర్తిగా, రెండో ప్రశ్నకు సగం ఆన్సరు రాయగలిగేడు. ఆ ప్రశ్న పూర్తిచేసి మరోటన్నా రాయగలిగితే బాగుండు.

ప్రసాద్, వెంకటరత్నంగారివైపు చూచాడు. ఆయన తలవంచుకొని బాధగా ఆలోచిస్తున్నట్లు కూర్చొనివున్నాడు.

తనకి నిజాయితీ గురించీ ప్రిన్సిపాలుగారు హితబోధచేయాలా? తను ధర్మంతప్పినట్లు, నిన్న గాక మొన్న సర్వీసులో జాయినైన సూర్యారావు ప్రిన్సిపాలుకు రిపోర్టివ్వటమా?

పదేళ్ళక్రితందాకా తను నిజాయితీగా, డ్యూటీ యీజ్ డ్యూటీ అన్నట్లు లెక్కచేయకుండా ప్రవర్తించాడు. ఎవడు గుర్తించారు తన సేవను? ఫలాని వెంకటరత్నం ఎంత సిన్సియర్? అని తోటివారు ఎవరన్నా వొక్కముక్క అన్నారా? కాగా తనని వెర్రివెంగళాయికింద జమకట్టిచాటుగా నవ్వుకొనేవారు.

ఇక విద్యార్థులు. వారి పాలిటి యముడు తాను. తనంటేనే అసహ్యం. సమయంవస్తే కాటెయ్యాలన్న ఆలోచనే.

పోనీ విద్యార్థుల తల్లిదండ్రులు - వూళ్ళో పెద్దలు - తను ఏంచేసినా పిల్లల భవిష్యత్తుకోసమేనన్న సత్యాన్ని గుర్తించారా? తమ పిల్లలని కట్టుదిట్టంలో పెట్టుకొన్నారా? వాళ్ళను మంచి మార్గంలో పెట్టటానికి ప్రయత్నించారా? లేదు. కాగా తనమీద కారాలు మిరియాలు నూరారు. పై అధికార్లకు రిపోర్టులిచ్చారు.

సమయం వచ్చినప్పుడు - అటు తోటివారు - యిటు విద్యార్థులు, వారి పెద్దలు ఏకమై - తనకి రావల్సిన ప్రమోషన్ పోగొట్టారు. మెమోలు సంజాయిషీలు... డిసిప్లినరీ ప్రొసీడింగ్స్. పనిష్మెంట్లు...

రేపు సూర్యారావుకు తన గతిపట్టదన్న నమ్మకం ఏమిటి?

ఆలోచించగా సూర్యారావు, చిన్ననాటి తనకు రిప్లికాగా కన్పించాడు. అలా కన్పించగానే యింతవరకు అతనిపై పెంచుకొంటున్న కోపంపోయి జాలికలిగింది.

తను మరికొన్ని నెలలో రిటైరవుతాడు. కాని అతను కుర్రవాడు. అనుభవించాల్సిన జీవితమంతా అతనికి ముందేవుంది.

అతనికి మంచిచెడ్డలు వివరించాలి. లోకరీతిబోధపర్చాలి. రానున్న ప్రమాదాన్ని అతనికి తెలియపర్చాలి. కాపాడాలి.

వెంకటరత్నం సూర్యారావు వైపు చూచాడు.

సూర్యారావు హాలులోవున్న పిల్లల్ని వొదిలేసి కిటికీలోనుంచి బయటికి చూస్తున్నాడు. వెంకటరత్నానికి తాను పదేళ్ళక్రితం యిలా ఎందుకు చేసేవాడో గుర్తు కొచ్చింది.

అదోఎత్తు.. ఉచ్చు... వల.. ట్రేప్...

కిటికీలోంచి చూస్తున్నట్లు, పేపరు చదువుకొంటున్నట్లు నటించి, విద్యార్థులకు కాపీకొట్టే అవకాశాన్నిచ్చి, వారిని గమనించి పట్టెయ్యటం. కొత్తలో తనకీ సరదాగానే వుండేది. పులివేటలాంటి వేట అది. పులిని పట్టినప్పటి ''థ్రిల్'' యిందులోనూ వుండేది తనకు అప్పట్లో.

కాని అదెంత పొరపాటు? విద్యార్థులు కాపీ కొట్టకుండా ''ప్రివెంట్'' చేస్తే సరిపోయే దానికి, యిలా వేటాడిపట్టడం తప్పుకాదూ?

'నీ డ్యూటీ ప్రకారం నువ్వు అప్రమత్తుడవై పరీక్షహాల్లో తిరుగుతూంటే కాపీలు కొట్టటానికి ధైర్యం చేయరు విద్యార్థులు. కాపీలుకొట్టే అవకాశం కల్పించి పట్టుకోవటం అన్యాయమూ, అక్రమమూనూ—''

ఏనాడో అనుభవంతో పండిన వో పెద్దమనిషి తనకిచ్చిన సలహాను యివాళ సూర్యారావుకు బోధచేయా లనిపించింది వెంకటరత్నానికి. కుర్చీలోంచి లేచాడు.

సరిగ్గా అదేసమయంలో జరగకూడనిది జరిగి పోయింది.

ప్రసాద్ ఆన్సర్ కాగితంఎత్తి చకచకా రాయసాగాడు. అలా అతను వ్రాస్తుండటమేమిటి - సూర్యారావు మెరుపులా వచ్చేసి, ఆన్సర్ స్క్రిప్టుక్రిందవున్న ఆ స్లిప్పులను పట్టేయటమేమిటి వొక్కసారే జరిగాయి.

'గెటప్—'

ప్రసాదు లేవలేదు. మింగేసేలా చూస్తున్నాడు.

'కమాన్, గివ్ దట్ ఆన్సర్ స్క్రిప్ట్—'

రెట్టిస్తూ అన్న అతనిమాటలకు సమాధానంగా ''టప్'' మని గట్టిగా శబ్దమయింది.

అంతా అటుచూచి నిశ్చేష్టులే అయ్యారు.

ఆన్సర్ స్క్రిప్టుకు పైభాగంలో 'పెన్ నైఫ్' బల్ల మీద గుచ్చబడివుంది నిలువుగా.

ప్రసాద్ తలవంచుకుని ఏదేదో రాస్తూనే వున్నాడు. వెంకటరత్నానికి ఏం చేయాలో తోచక దగ్గరికెళ్ళాడు చకచకా

"నో దిస్ యాజ్ బేడ్. ఐ డోన్ట్ లీవ్ యు టు రైట్ -" ప్రసాద్ రాస్తున్న ఆన్సరు పేపర్ని పట్టుకొని గట్టిగా అన్నాడు సూర్యారావు.

"ఫస్ట్‌వార్నింగ్. వదలండి నా పేపరు. లేకపోతే యిక్కడే అంతుచూస్తాను——" ప్రసాదు లేచాడు. అతనిచెయ్యి కత్తిపిడిపైన పడింది. రెండోచెయ్యి పేపర్ని పట్టుకునే వుంది.

"ప్రసాద్. ఏమిటోయ్ యిది. ఇది పరీక్షహాలని మర్చిపోయావా? కూర్చో. ఆ కత్తి వదులు ముందు..."

"ముందాయన్ని పేపరు వదలమనండి మాస్టార్షూ..."

"మాస్టారూ..."

"నో. అయాంసారీ"

"సెకండ్ వార్నింగ్..."

"మాస్టారూ ... నాకేం ఫర్వాలేదు. ముందు వెళ్ళి ప్రిన్సిపాలుగారిని పిల్చుకొని రండి."

"అదికాదు సూర్యారావుగారూ ... నేను చెప్పేది వినండి. అంతా సర్దుబాటవుతుంది. నేనతన్ని అన్నిటికీ వప్పిస్తాను -"

"సారీ సార్ ... నేనతన్ని రాయనివ్వను -"

"రాయనివ్వవేం! నేను నిన్ను బతకనివ్వను."

"మాస్టారు.. ప్రిన్సిపాలుగారిని.. "

వెంకటరత్నం చేసేది లేక బయటికి నడవబోయాడు.

"ప్రిన్సిపాల్‌ని పిలిపిస్తావేం! వొదల్రా నా కాగితాల్ని ముందు -"

ఆన్సరు స్క్రిప్టును పట్టి లాగటంలో అది మధ్యకు రెండుగా చినిగిపోయింది. కొంతభాగం ప్రసాద్ చేతిలో - మరో భాగం సూర్యారావు చేతిలో -

ఫైనల్ బెల్లుకావటానికి సూచనగా వార్నింగ్ బెల్లు అయింది.

చినిగిన కాగితం ముక్కల్ని చూచేసరికి ప్రసాద్ కోపం విజృంభించింది. పగసాధైంది.

"నువ్వు ... నువ్వు ... నా కాగితాల్ని చించుతావురా. మా జీవితాల్ని నాశనం చేస్తావుట్రా. నిన్ను ... నిన్ను ..."

ప్రసాద్ మాటల వేగంతోపాటు కత్తిచేతిలో బిగుసుకొని పోయింది.

మూడోసారి 'నువ్వు' అన్న పదాన్ని నోరు వుచ్చరించింది. అదే సమయంలో కత్తివున్న చెయ్యిలేచి సూర్యారావు గుండెల్లో పొడిచింది.

అంతా ఒక్క క్షణం! కనురెప్పపాటులో—

''అమ్మో'' అని సూర్యారావు అనేటంతలో మరోపోటు—

''ఇప్పుడు పిలవరా ప్రిన్సిపాలుని - నీ బాబుని కూడా -'' అంటూనే కత్తిపట్టుకుని అలాగే బయటికి పరుగెత్తి పోయాడు ప్రసాద్.

అప్రతిభులై అంతా అలాగే చూస్తుండిపోయారు.

సూర్యారావును కింద పడకుండా వెంకటరత్నం పట్టుకొన్నాడు.

యిక్కడ జరుగుతున్న గంద్రగోళం తెల్సి, ప్రిన్సిపాలుగారు హడావుడిగా ఆ హాల్లోకి అడుగుపెట్టుండగా ఫైనల్ బెల్లు గణగణ మంటూ బిగ్గరగా మూలిగింది.

★——★——★

మూడు నెలల హాస్పిటల్ జీవితం గడిపి, బయటపడ్డనాడు హాయిగా వూపిరి పీల్చాడు సూర్యారావు.

హాస్పిటల్‌లో చేరిన మొదటి మూడురోజులే, డాక్టర్ల శ్రద్ధ. అసంఖ్యాకంగా వచ్చిన విజిటర్స్ కుశల ప్రశ్నలు. ప్రెస్ విలేకరుల ఇన్‌టర్వ్యూలు. అధికారుల, అనధికారుల ఆదరింపులు. ఆ ఇన్‌సిడెంట్ పాతబడగానే తనూ పాతబడ్డాడు.

ఒంటరితనం ఆలోచనలమీద సవారీ చేసింది. సమస్యలను పెంచింది.

తనను నమ్ముకొన్నవారికి తన జీతం వస్తే తప్ప నోట్లోకి చెయ్యిపోయే పరిస్థితిలేదు. లీవు లేదు తనకు. కనుక జీతం రాదు.

ఇంట్లోవాళ్ళు ఒకపూట తింటే మరోపూట పస్తు. కాగా తనచుట్టూ తిరగడానికి, మందులకు, పండ్లకు, పాలకు... ఎవరూ పలుకరించలేదు, ఆదుకోలేదు.

కాలేజీలో తిరిగి జాయిన్ కానటానికి కాలేజీలో అడుగుపెట్టగానే తెల్సిన మొదటి విషయం ''కొత్త ప్రిన్సిపాల్‌గారు వచ్చారు''(?)

రెండో సమాచారం - ''ఆ నాటి సంఘటనమీద దర్యాప్తు జరుపుతారట''(?)

కొత్త ప్రిన్సిపాల్‌గారు ఆమాటా యీమాటా మాట్లాడేక సూర్యారావు జాయినింగ్ రిపోర్టు యిచ్చాడు.

ప్రిన్సిపాల్ అతనివైపు ఆశ్చర్యంగా చూచారు. కాలింగ్‌బెల్ నొక్కుతూ అన్నారు - ''అయితే మీకింకా తెలియదన్నమాట. అయాం సారీ. మీకు ట్రాన్స్‌ఫర్ అయింది.''

తనకి బదిలీనా? ఎందుకు? పిల్లల చదువులేం కావాలి? వొచ్చి ఆరునెలలన్నా కాలేదే?

ఆర్డర్ కాగితాలనిస్తూ అన్నారు పిన్సిపాల్‌గారు - ''సమయం సందర్భం గమనించి పోతుండాలి మిష్టర్ సూర్యారావు. విద్యార్థులను హేండిల్ చేయటానికి ''టెక్నిక్స్'' తెల్సివుండాలి. వొక్క ఆదర్శముంటేనే చాలదు. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్ యిన్ యువర్ న్యూప్లేస్''

ట్రాన్స్‌ఫర్ ఎక్కడో మారు మూలప్రదేశానికి.

''పనిష్మెంటు కాని కాదుకదా?'' అనుకొన్నాడు.

''అయినా ఫర్వాలేదు. ఎక్కడైనా పిల్లలే - పాఠాలే. వొకటే సమస్యలు. ఎక్కడైనా ఆల్ రైట్ - '' అనుకొన్నాడు ఆ వెంటనే.

ఏదో ధైర్యం... ఉత్సాహం... పట్టుదల..

బయటికి రాగానే వెంకటరత్నం కన్పించాడు. ఆమాటా యీమాటా చెప్తూ స్టాఫ్ రూంవైపు నడిచారు.

''చూడు సూర్యారావ్ చిన్నవాడివి, వో సలహా చెప్పనా? నీ పద్ధతి మంచిదే. కాని ఏటికెదురీదితే ఎవరికయ్యా నష్టం? దర్భపోచకే. నువ్వూ నేనూ దర్భపోచల్లాంటివాళ్ళం. నేనూ మునిగేను. కాని నువ్వు జీవితాన్ని అనుభవించాల్సిన వాడివి. నామాట విను. పిల్లల క్రమశిక్షణపట్ల ఉపాధ్యాయుడికెంత బాధ్యతవుందో, వారి తలిదండ్రులకీ అంతేవుంది. ఆ తలిదండ్రులే ఆబాధ్యతను విస్మరించి నీ బోటి వాళ్ళమీద కత్తికట్టుంటే నువ్వేం చెయ్యగలవయ్యా?''

సూర్యారావు మాట్లాడలేదు. మాట్లాడి ప్రయోజనం లేదని అతనికి తెల్సు.

''యీ విషయం విన్నావోలేదో'' అంటూ రహస్యంగా చెప్పసాగాడు వెంకటరత్నం ''నిన్ను పొడిచిన ఆ ప్రసాద్ చదువుకు స్వస్తి చెప్పి మొన్నటి ఎలక్షన్లో పంచాయతీ సమితి ప్రెసిడెంట్ అయ్యాడు. నీ బదిలీకి ఊరిపెద్దలే...''

''అయినా ఫర్వాలేదు మాస్టారూ. కాని నా ఆదర్శాన్ని వదలను. తల్లిదండ్రులు విస్మరించారని మనమూ విస్మరిస్తే పిల్లలు ఎలా తయారవుతారు? క్రమశిక్షణ పెంచుకోని విద్యార్థులు భావిజీవితాల్లో ఎలా ప్రవర్తిస్తారు? క్రమశిక్షణ, నిజాయితీలేని ప్రజలున్న దేశం ఏం బాగుపడుతుంది మాస్టారూ...'' అని అరిచి చెప్పాలనుకున్నాడు సూర్యారావు. కాని మెల్లగా నవ్వి ఊరుకొన్నాడు.

అందరి సానుభూతులనూ, చిరునవ్వుతో త్రోసిపుచ్చి సెలవుతీసుకొని నిర్భయంగా, నిశ్చలంగా, దృఢంగా, ఆత్మనిశ్చయంతో అడుగులు వేసుకొంటూ నడిచివెళ్తున్న సూర్యారావుకు, కారిడార్ లో నిలబడి వీడ్కోలిస్తూ, మనసులోనే భగవంతుడిని ప్రార్థించాడు వెంకటరత్నం.

''మంచికుర్రాడు. యితన్ని ఈ రాజకీయహోమంలో సమిధకాకుండా కాపాడు భగవాన్''

ఆంధ్రజ్యోతి వారపత్రిక — **28.1.1972**